క్లుప్తంగా

సీనియర్ సిటిజన్లకు ఆర్టీసీ బంపర్ ఆఫర్

మిర్యాలగూడ టౌన్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే సీనియర్ సిటిజన్లకు ఆర్టీసీ ప్రత్యేక రాయితీని ప్రకటించింది. పల్లె వెలుగు బస్సుల్లో ప్రయాణించే సీనియర్ సిటిజన్లకు టికెట్ చార్జీలో 50శాతం రాయితీని కల్పించింది. ఈ అవకాశం 60ఏళ్లు దాటిన మహిళలు, పురుషులకు వర్తిస్తుందని, వారు వయస్సు ధ్రువీకరణకు సంబంధించి కండక్టర్లకు ఆధార్ కార్డులు చూపించాల్సి ఉంటుందని మిర్యాలగూడ ఆర్టీసీ డీఎం బొల్లెద్దు పాల్ తెలిపారు. ఈ అవకాశం మంగళవారం ఒక్క రోజు మాత్రమేనని, అది కూడా పల్లె వెలుగు బస్సుల్లో మాత్రమేనని పేర్కొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

దేవరకొండ: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో దేవరకొండ మండలానికి చెందిన 117 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను సోమవారం ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల ద్వారా పేదింటి ఆడబిడ్డల వివాహానికి ప్రభుత్వం రూ.లక్ష ఆర్థికసాయం అందజేస్తుందని అన్నారు. సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చింతపల్లి సుభాష్‌గౌడ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు టీవీఎన్ రెడ్డి, నాయకులు సైదులు, జయప్రకాష్, అంజయ్య, తిరుపతయ్య, వేముల రాజు, బొడ్డుపల్లి కృష్ణ, తౌఫిక్, రవి, ఇలియాస్, సత్తార్ తదితరులున్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



మాట్లాడుతున్న సీడీపీఓ చంద్రకళ

మాడుగులపల్లి: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడంతో తల్లి, బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని సీడీపీఓ చంద్రకళ అన్నారు. మండలంలోని పాములపహాడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్యలక్ష్మి పథకంలో భాగంగా సోమవారం గర్భిణులు, బాలింతలకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి సీడీపీఓ చంద్రకళ హాజరై పౌష్టికాహారం ఆవశ్యకత గురించి వివరించారు. గర్భిణులు సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఐరన్, కాల్షియం మాత్రలు తప్పనిసరిగా వేసుకోవాలని, పుట్టిన ఆరు నెలల లోపు శిశువుకు తల్లిపాలే పట్టాలన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ యాతం లక్ష్మి, వైద్యాధికారి సత్యనారాయణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రజిని, సునీత, నాగమణి, పీహెచ్‌ఎన్ జయలక్ష్మి, ఆరోగ్య పరిశీలకురాలు రాణి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

దేశ విభజన నాటి ఫొటోల ప్రదర్శన



తపాలా కార్యాలయంలో ఫొటో ఎగ్జిబిషన్ తిలకిస్తున్న ఉద్యోగులు, స్థానికులు

మిర్యాలగూడ టౌన్: పట్టణంలోని ఖమ్మం రోడ్డులో గల ప్రధాన తపాలా కార్యాలయంలో సోమవారం దేశ విభజన నాటి ఫొటోలను ఎగ్జిబిషన్ రూపంలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు మాట్లాడుతూ.. ఆగస్టు 14వ తేదీని 'విభజన భయానకాల స్మారక దినం'గా కేంద్రం ప్రకటించిందన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ అసిస్టెంట్ మేనేజర్ ప్రతాప్‌సింగ్, హెడ్ పోస్టుమాస్టర్ సిరాజ్, సునీల్, సూర్యాపేట తపాలా శాఖ సహాయ పర్యవేక్షకుడు ఎండీ నయీమొద్దీన్ తదితరులు పొన్నారు.

అనర్హులకు ఇళ్ల పట్టాలు ఇవ్వొద్దని వినతి

త్రిపురారం: మండలంలోని కంపాలపల్లి గ్రామంలో అనర్హులకు ప్రభుత్వ భూమిలో ఇళ్ల పట్టాలకు పంపిణీ చేసేందుకు ప్రయత్నిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ సైదులుకు గ్రామస్తులు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 15 సంవత్సరాల క్రితం అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాలకు ఇవ్వడానికి గ్రామంలో 3 ఎకరాల భూమిని కొనుగోలు చేసిందన్నారు. అయితే ఆ భూమిని ఇప్పుడు ఎలాంటి గ్రామ సభ నిర్వహించకుండా అనర్హులైన 98 మందికి ఒక్కొక్కరికి 75 గజాల చొప్పున పంపిణీ చేయడానికి సిద్ధమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుపేదలకు కాకుండా ట్రాక్టర్లు, తోటలు, భూస్వాములు, ప్రభుత్వ ఉద్యోగులు, రేషన్ కార్డులేని వ్యక్తులకు భూమి పంచేందుకు చూస్తున్నారని ఆరోపించారు. ఇదే విషయమై జిల్లా కలెక్టర్‌కు సైతం ఫిర్యాదు చేశామని అన్నారు. కార్యక్రమంలో బొల్లెంపల్లి శంకర్, బోలెంపల్లి అంజి,రెమిడాల శ్రీకాంత్, సలికంటి బాలకృష్ణ, అంజమ్మ, అనుముల అచ్చమ్మ, యేసు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అందని ద్రాక్షగా కంప్యూటర్ విద్య

- లక్షల రూపాయలు వెచ్చించి పాఠశాలల్లో ల్యాబ్‌ల ఏర్పాటు
- ట్యూటర్లను నియమించకపోవడంతో నిరుపయోగం



అల్వాల ప్రాథమికోన్నత పాఠశాలలో మూలనపడిన కంప్యూటర్లు

తిరుమలగిరి(నాగార్జునసాగర్): ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులకు కంప్యూటర్ విద్య అందని ద్రాక్షగానే మిగిలింది. పదేళ్ల క్రితం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ప్రత్యేకంగా కంప్యూటర్ ల్యాబ్స్‌ను అప్పటి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ప్రత్యేక గదిలో ఆధునిక పరికరాలతో పాటు విద్యార్థులు కూర్చునేందుకు వీలుగా కుర్చీలు ఏర్పాటు చేశారు. అయితే కంప్యూటర్ బోధించే ఉపాధ్యాయులను(ఇన్‌స్ట్రక్టర్)ను మాత్రం నియమించలేదు. ఫలితంగా కంప్యూటర్ ల్యాబ్‌లు నిరుపయోగంగా మారాయి. తిరుమలగిరి మండలంలో నాలుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, నాలుగు ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటి పరిధిలో ఆరు నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులు సుమారుగా 300 మంది ఉన్నారు. ఆయా పాఠశాలల్లో కంప్యూటర్ ల్యాబ్‌లు ఏర్పాటు చేసినా ట్యూటర్లు లేక అవి మూలనపడ్డాయి. పాఠశాలలకు కంప్యూటర్లను ఇచ్చిన ప్రభుత్వం సైన్స్, గణితం బోధించే ఉపాధ్యాయుల ద్వారా కంప్యూటర్‌ను విద్యను అందించాలని తొలుత నిర్ణయించారు. దీనికి ఉపాధ్యాయుల నుంచి వ్యతిరేకత రావడంతో ఆ నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకుంది. నాటి నుంచి ఇప్పటి వరకు కంప్యూటర్ విద్యను చెప్పేవారు లేకపోవడంతో కంప్యూటర్లన్నీ మూలనపడ్డాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు కంప్యూటర్ విద్యను అందించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

కంప్యూటర్ నేర్పించాలి



మా పాఠశాలలో కంప్యూటర్లు ఉన్నాయి. కానీ వాటి గురించి వివరించే టీచర్ లేరు. మాకు కంప్యూటర్ నేర్పించినట్లయితే అవగాహన పెరిగి భవిష్యత్తులో ఇబ్బందులు లేకుండా ఉంటుంది. కంప్యూటర్లను వినియోగంలోకి తీసుకొవచ్చి మాకు కంప్యూటర్ గురించి నేర్పించాలి.

– శ్రీవిద్య, పదో తరగతి, తిరుమలగిరి జెడ్పీహెచ్‌ఎస్

ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పించాలి



మాట్లాడుతున్న దళిత సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉబ్బపల్లి కాశయ్య

మిర్యాలగూడ టౌన్: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని దళిత సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉబ్బపల్లి కాశయ్య, జిల్లా అధ్యక్షుడు పాలే రవి అన్నారు. సోమవారం మిర్యాలగూడ పట్టణంలోని సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. మన ఊరు–మన బడి కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ సరిగ్గా నిధులు మంజూరు చేయకపోవడంతో పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారిందన్నారు. ప్రైవేట్ పాఠశాలలు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నాయన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాశాఖ ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలన్నారు. అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్ షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల కోరారు. సమావేశంలో దుబ్బా కోటేష్, వెంకటేశ్వర్లు, ప్రభాకర్, నర్సింహ, శంకర్, కిరణ్ తదితరులున్నారు.

బాధ్యతలు స్వీకరించిన నూతన తహసీల్దార్లు



హరిబాబు, మిర్యాలగూడ

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ తహసీల్దార్‌గా నలబాలపు హరిబాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న గణేష్ ఇటీవల బదిలీపై కొండమల్లేపల్లి తహసీల్దార్‌గా వెళ్లగా.. ఆయన స్థానంలో నయాబ్ తహసీల్దార్‌గా పనిచేస్తున్న అనిల్‌కుమార్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఇప్పుడు రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో నయాబ్ తహసీల్దార్‌గా పనిచేస్తున్న హరిబాబు పదోన్నతిపై మిర్యాలగూడ తహసీల్దార్‌గా వచ్చారు. హరిబాబుకు అధికారులు, కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

అనుముల తహసీల్దార్‌గా జయశ్రీ..



జయశ్రీ, అనుముల

హాలియా: అనుముల మండల తహసీల్దార్‌గా వజ్రాల జయశ్రీ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అంతకు ముందు ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన మంగ బదిలీపై నాగర్‌కర్నూల్ జిల్లాకు వెళ్లారు. ఆమె స్థానంలో త్రిపురారం తహసీల్దార్‌గా పనిచేస్తున్న వజ్రాల జయశ్రీ బదిలీపై అనుముల మండలానికి వచ్చారు.

చింతపల్లి తహసీల్దార్‌గా శంషాద్దీన్...

చింతపల్లి: మండల తహసీల్దార్‌గా మహ్మద్ శంషాద్దీన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన విశాలాక్షి జనగామ జిల్లాకు బదిలీ కాగా ఆమె స్థానంలో నల్లగొండ నుంచి శంషాద్దీన్ బదిలీపై ఇక్కడికి తహసీల్దార్‌గా వచ్చారు.

నిడమనూరు తహసీల్దార్‌గా కృష్ణయ్య..



కృష్ణయ్య, నిడమనూరు

నిడమనూరు: మండల తహసీల్దార్‌గా జే. కృష్ణయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎం. శ్రీధర్‌ను యాదాద్రి జిల్లాకు బదిలీ అయ్యారు. ఎం. శ్రీదర్ వారం క్రితమే నిడమనూరుకు తహసీల్దార్‌గా రాగా ఆయనను లోగా మళ్లీ బదిలీ చేసి, నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలో పనిచేస్తున్న జే. కృష్ణయ్యను ఇక్కడ తహసీల్దార్‌గా నియమించారు.

వేములపల్లి తహసీల్దార్‌గా శ్రీనివాస్‌శర్మ..



శ్రీనివాస్‌శర్మ, వేములపల్లి

వేములపల్లి: మండల తహసీల్దార్‌గా శ్రీనివాస్‌శర్మ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన వెంకటేశం జనగామ జిల్లాకు బదిలీ కాగా.. ఆయన స్థానంలో చండూరు తహసీల్దార్‌గా పనిచేస్తున్న శ్రీనివాస్‌శర్మ వేములపల్లి మండలానికి బదిలీపై వచ్చారు.

ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలి

మిర్యాలగూడ అర్బన్: పట్టణంలోని ప్రధాన రోడ్డులో ట్రాఫిక్ నియంత్రణకు ప్రతిఒక్కరూ సహకరించాలని మిర్యాలగూడ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ మోహన్ అన్నారు. సోమవారం మిర్యాలగూడ పట్టణంలోని గాంధీ బొమ్మ వద్ద ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. రోడ్డు మధ్యలో ఆటోలను నిలిపి ట్రాఫిక్ కు అంతరాయం కలిగించకూడదని వివరించారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ.. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన 9 మందిని మిర్యాలగూడ కోర్టులో హాజరుపర్చగా జడ్జి ఆరుగురికి రూ.7200 జరిమానా, ఒకరికి 3రోజుల జైలు శిక్ష విధించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం



బహుమతులు అందజేస్తున్న తిరునగరు భార్గవ్, నల్లమోతు సిద్దార్థ

మిర్యాలగూడ: మిర్యాలగూడ డివిజన్ ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం సోమవారం పట్టణంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్, ఎన్‌బీఆర్ ఫౌండేషన్ చైర్మన్ నల్లమోతు సిద్దార్థ, మార్కెట్ కమిటీ చైర్మన్ సంపత్‌కుమార్ హాజరై నూతన అధ్యక్షుడు సిరిమల్లె వెంకన్నగౌడ్, ప్రధాన కార్యదర్శి పందిరి లక్ష్మణ్, కార్యవర్గ సభ్యులను అభినందించారు. అనంతరం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి వారు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు వెంకట్‌రెడ్డి, రాపర్తి శ్రీనివాస్‌గౌడ్, పున్నా రామకృష్ణ, ఏలియా, ముత్యంరెడ్డి, రామలింగాచారి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

భారతదేశ ఔన్నత్యం ఎంతో గొప్పది



దేవరకొండ: తిరంగా ర్యాలీలో పాల్గొన్న నాయకులు



హాలియా: ర్యాలీలో పాల్గొన్న బీజేపీ నాయకురాలు నివేదితారెడ్డి

దేవరకొండ: ప్రపంచ దేశాల్లోకెల్లా భారతదేశ ఔన్నత్యం ఎంతో గొప్పదని విశ్వహిందూ పరిషత్ తెలంగాణ ప్రాంత సంఘటన కార్యదర్శి యాదగిరిరెడ్డి అన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం దేవరకొండ పట్టణంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని పేర్కొన్నారు.అంతకు ముందు పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల నుంచి విద్యార్థులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో భజరంగ్‌దళ్ రాష్ట్ర కోకన్వీనర్ వెంకట్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కర్నాటి సురేష్, కేతావత్ లాలునాయక్, నాయకులు చెనమోని రాములు, అంకూరి నర్సింహ, ఏటి కృష్ణ, గాజుల మురళి, కళ్యాణ్‌నాయక్, గుండాల అంజయ్య, వినోద్‌రాథోడ్, జల్లా భాస్కర్ తదితరులున్నారు.

హాలియాలో ర్యాలీ..

హాలియా: హాలియా మున్సిపాలిటీ కేంద్రంలో సోమవారం మేరీ మిట్టీ..మేరీ దేశ్ (నా దేశం.. నా మట్టి) కార్యక్రమాన్ని నాగార్జునసాగర్ నియోజకవర్గ బీజేపీ నాయకురాలు కంకణాల నివేదితారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం పట్టణంలో విద్యార్థులతో కలిసి ఆమె జాతీయ పతాకాలను చేతబూని భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నారాయణరెడ్డి, వెంకట్‌రెడ్డి, గంగా, శిరీష, దేవి, యాదగిరి, పాండు, ఉయ్యాల నరసింహ, పునీత్ తదితరులు ఉన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న యూఎస్‌ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

దేవరకొండ: తెలంగాణ ప్రభుత్వం విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని యునైటెడ్ స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(యూఎస్‌ఎఫ్ఐ) రాష్ట్ర అధ్యక్షుడు వంగూరి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. దేవరకొండలో సోమవారం యూఎస్‌ఎఫ్ఐపై నూతనంగా రూపొందించిన వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగానికి అధిక ప్రాధాన్యతనిస్తూ బడ్జెట్‌లో నిధులు కేటాయించాలన్నారు. ఉపకార వేతనాలు, ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల కాకపోవడంతో పేద, మధ్య తరగతి విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న టీచర్లు, లెక్చరర్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో సొభాన్, రాజేష్, బాలాజీ, రాము, కళ్యాణ్, నితిన్ తదితరులు పాల్గొన్నారు.

సదస్సు జయప్రదం చేయాలి

మిర్యాలగూడ: మండలంలోని శ్రీవిజయ గార్డెన్‌లో ఈ నెల 17న నిర్వహించనున్న ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జిల్లా సన్నాహక సదస్సును జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు జిల్లా తిరుమలేష్ అన్నారు. సోమవారం మిర్యాలగూడ మండలంలోని దామెరభీమనపల్లిలో ఈ సదస్సుకు సంబంధించిన కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ సాధనకు మాదిగలు గట్టి పోరాటం చేస్తున్నారని అన్నారు. ఈ సదస్సుకు ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ హాజరవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు గ్యార శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు ముదిగొండ రమేష్, నాయకులు వడ్డె రంజిత్, జిల్లా రవి, చెక్క సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు ఆర్థికసాయం అందజేత



హాలియా: నాగేశ్వరరావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న బుసిరెడ్డి పాండురంగారెడ్డి



హాలియా: నర్సింహకు ఆర్థికసాయం అందజేస్తున్న మన్నెం రంజిత్‌యాదవ్

హాలియా: అనుముల మండలంలోని కొరివేనిగూడెం గ్రామానికి చెందిన తుమ్మగోటి నాగేశ్వరరావు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి సోమవారం మృతుడు నాగేశ్వరరావు నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులకు పరామర్శించి రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో తిరుమలగిరి వైస్ ఎంపీపీ యడవెల్లి దిలీప్‌రెడ్డి, నిడమనూరు మండల మాజీ ఎంపీపీ, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు అంకతి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

త్రిపురారంలో అన్నదానం..

త్రిపురారం: మండల కేంద్రంలోని దుబ్బమీద బజారుకు చెందిన ఉండికొటి కృష్ణమ్మ సోమవారం అనారోగ్యంతో మృతిచెందింది. మృతురాలి అంత్యక్రియల అనంతరం ఆమె కుటుంబ సభ్యులు, బంధువులకు బుసిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

నిరుపేదకు రూ.10వేలు అందజేత

హాలియా: పక్షవాతంతో బాధపడుతున్న అనుముల మండలంలోని పేరూర్ గ్రామానికి చెందిన గుండెబోయిన నర్సింహకు సోమవారం బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు మన్నెం రంజిత్‌యాదవ్ రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో పసుల ప్రసాద్‌యాదవ్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు షరీఫ్, షేక్ మక్బూల్ తదితరులు ఉన్నారు.

నిడమనూరులో..

నిడమనూరు: మండలంలోని నారమ్మగూడెం మాజీ సర్పంచ్, మిర్యాలగూడ డివిజన్ యాదవ సంఘం మాజీ అధ్యక్షుడు నాగనబోయిన వీరయ్య పార్థివదేహానికి సోమవారం బీఆర్‌ఎస్ నాయకుడు మన్నెం రంజిత్‌యాదవ్ నివాళులర్పించారు. అదేవిధంగా ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన సోమోరిగూడెం సర్పంచ్ నర్సింగ్ శంకర్ కుటుంబ సభ్యులను కూడా ఆయన పరామర్శించారు. మండలంలోని మార్లగడ్డ క్యాంపునకు చెందిన జశ్వంత్(3) ఇటీవల మృతిచెందాడు. జశ్వంత్ కటుంబ సభ్యులను రంజిత్ యాదవ్ పరామర్శించి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు ఆయన వెంట వైస్ ఎంపీపీ బైరెడ్డి వెంకటరెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ వి. అంజయ్య, కేశబోయిన జానయ్య తదితరులున్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ..

గుర్రంపోడు: మండలంలోని పోచంపల్లి, చేపూరు గ్రామాల్లో ఇటీవల మృతిచెందిన పూల రాములు, పడాల పెద్దులు కుటుంబాలను మన్నెం రంజిత్ యాదవ్ పరామర్శించారు. ఆయన వెంట సర్పంచులు కట్టెబోయిన విజయ్, షేక్ సయ్యద్‌మియా, మదార్‌షా, కృష్ణప్రసాద్ తదితరులు ఉన్నారు.

హెల్పింగ్ హ్యాండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో

పెద్దవూర: మండల కేంద్రానికి చెందిన గంధం మానస రెండు కిడ్నీలు రెండేళ్ల క్రితం చెడిపోవడంతో ఆమె తల్లి కిడ్నీని ఒకదానిని ఇటీవల మానసకు అమర్చారు. దీంతో మానస భర్త గంధం ప్రవీణ్‌కుమార్ భార్య, అత్తలకు సపర్యలు చేస్తూ ఇంటి వద్దనే ఉంటుండడంతో కుటుంబ పోషణ కష్టతరంగా మారింది. విషయం తెలుసుకున్న హెల్పింగ్ హ్యాండ్స్ అసోసియేషన్ సభ్యులు సోమవారం బాధితురాలి కుటుంబ సభ్యులకు తమ వంతుగా రూ.15వేలు ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో మిట్టపల్లి రవికుమార్, కత్తి ప్రభాకర్‌రెడ్డి, అన్వేష్‌రెడ్డి, కేస నరేష్, రిషి తదితరులు పాల్గొన్నారు.

పనులు చేపట్టని కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి



హాలియా: కలెక్టర్ కర్ణన్‌కి వినతి పత్రం అందజేస్తున్న వర్ర వెంకట్‌రెడ్డి



మిర్యాలగూడ: కలెక్టర్ కర్ణన్‌కు వినతిపత్రం అందజేస్తున్న పగిడి జీడయ్యయాదవ్

హాలియా: మున్సిపాలిటీ పరిధిలో సీసీ రోడ్లు, డ్రెయినేజీ కాల్వల నిర్మాణ టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ 9 నెలలు అవుతున్నా పనులు ప్రారంభించలేదని, అతనిపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని హాలియా బీఆర్‌ఎస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్, జిల్లా కౌన్సిల్ ఫోరం అధ్యక్షుడు వర్ర వెంకట్‌రెడ్డి సోమవారం నల్లగొండ కలెక్టరేట్‌లో కలెక్టర్ కర్ణన్‌కు వినతి పత్రం అందజేశారు. నాగార్జునసాగర్ ఉప ఎన్నిక సమయంలో సీఎం కేసీఆర్ హాలియా మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.25 కోట్ల నిధులు కేటాయించారన్నారు. డ్రెయినేజీలు, సీసీ రోడ్ల నిర్మాణానికి స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ రూ.4.5 కోట్ల నిధులు కేటాయించారని పేర్కొన్నారు. ఈ నిధులతో 11వ వార్డులో డ్రెయినేజీ, సీసీ రోడ్లు నిర్మాణం చేపట్టేందుకు కాంట్రాక్ట్ దక్కించుకున్న కాంట్రాక్టర్ సుమారు 9 నెలలు కావొస్తున్నా పనులు ప్రారంభించలేదని పేర్కొన్నారు. వెంటనే పనులు ప్రారంభించేలా చూడాలని లేదా సదరు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో పేర్కొన్నారు.

రిజర్వేషన్ ప్రకారం సీట్లు కేటాయించాలి

మిర్యాలగూడ: బీసీ గురుకులాల్లో బీసీలకు ప్రభుత్వ రిజర్వేషన్ ప్రకారం సీట్లు ఇవ్వాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పగిడి జీడయ్యయాదవ్ అన్నారు. ఈ మేరకు సోమవారం నల్లగొండలో కలెక్టర్ కర్ణన్‌కు ఆయన వినతిపత్రం అందజేసి మాట్లాడారు. బీసీ గురుకుల విద్యాలయాల్లో విద్యార్థులకు అడ్మిషన్ల విషయంలో, ఉద్యోగాల విషయంలో బీసీలకు రిజర్వేషన్ అమలు చేయడం లేదన్నారు. బీసీలకు ఇవ్వాల్సిన సీట్లను ఇతర కులస్తులకు కేటాయిస్తూ బీసీ విద్యార్థులకు అన్యాయం చేస్తున్నారన్నారు. బీసీ గురుకుల సెక్రటరీ పోస్టుకు బీసీ ఐఏఎస్ అధికారిని నియమిచాలని డిమాండ్ చేశారు.

రెండో విడత గొర్రెలు పంపిణీ చేయాలి..

మాడుగులపల్లి: రెండో విడత గొర్రెల యూనిట్ల కోసం డీడీలు చెల్లించిన లబ్ధిదారులకు వెంటనే పంపిణీ పూర్తి చేయాలని కోరుతూ గొర్రెలు, మేకల పెంపకందారుల సహకారం సంఘం డివిజన్ అధ్యక్షుడు ఊరిబండి శ్రీనివాస్ సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ కర్ణన్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం సకాలంలో గొర్రెల యూనిట్లు పంపిణీ చేయకపోవడంతో అప్పులు తెచ్చి డీడీలు చెల్లించిన గొల్ల, కురుమలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. గొర్రెలు పంపిణీ చేస్తే కృష్ణ, గుంటూరు, ప్రకాశం జిల్లాల నుంచే కొనుగోలు చేసి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట సంఘానికి చెందిన పలువురు సభ్యులు ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

జిల్లా మహాసభను విజయవంతం చేయాలి

దేవరకొండ: మర్రిగూడలో ఈ నెల 17న ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన జిల్లా మహాసభను విజయవంతం చేయాలని ఎంఎస్‌ఎఫ్ దేవరకొండ నియోజకవర్గ ఇన్‌చార్జి అంకూరి నాగరాజు పిలుపునిచ్చారు. సోమవారం దేవరకొండలో ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి యాదగిరి తదితరులున్నారు.

దోమల నివారణకు ఫాగింగ్

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్ మెయిన్ డ్యాంతో పాటు ఎర్త్‌డ్యాం మీద విపరీతంగా దోమలు ఉంటుండడంతో కాలినడకన, ద్విచక్ర వాహనాలపై వెళ్లలేని పరిస్థితి నెలకొంది. దోమలను నివారించేందుకు ఎర్త్ డ్యాంతో పాటు మెయిన్ డ్యాం, పైలాన్ కాలనీలోని వీధుల్లో సోమవారం నందికొండ మున్సిపాలిటీ అధికారులు ఫాగింగ్ చేయించారు.

సమ్మె నోటీసు అందజేత

కొండమల్లేపల్లి: తమఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని ఈ నెల 16 నుంచి నిరవధిక సమ్మె చేయనున్నట్లు సోమవారం కొండమల్లేపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి ఉషారాణి, తహసీల్దార్ కార్యాలయంలో రెండవ ఏఎన్‌ఎంలు నోటీసు అందజేశారు. కార్యక్రమంలో ధనలక్ష్మి, తిరుపతమ్మ, సునిత, జ్యోతి, ఇఫ్రాత్, శ్రీదేవి, బ్లెస్సీ తదితరులున్నారు.

ఏఐఎస్‌ఎఫ్ ఆవిర్భావ వేడుకలు

చింతపల్లి: ఏఐఎస్‌ఎఫ్ ఆవిర్భావ వేడుకలను పురస్కరించుకొని సోమవారం మండల కేంద్రంలో సంఘం జిల్లా అధ్యక్షుడు వలమాల ఆంజనేయులు ఏఐఎస్‌ఎఫ్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ డివిజన్ కార్యదర్శి బొడ్డుపల్లి అర్జున్, డివిజన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి షేక్ శంషాద్దీన్, వట్టికోటి శ్రీకాంత్ తదితరులున్నారు.

రక్తదానం చేసిన యువత

నిడమనూరు: మండలంలోని ముకుందాపురం గ్రామానికి చెందిన వన్ చాలెంజ్ వ్యవస్థాపకుడు, డీఎస్పీ నూకల వేణుగోపాల్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా సోమవారం గ్రామంలో పలువురు యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో జంపుల రవి, రాంబాబు, గోవర్ధనాచారి తదితరులున్నారు.

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్ష

పెద్దవూర: మండలంలోని పులిచర్ల గ్రామాన్ని నూతన మండలంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ గ్రామంలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష కొనసాగుతోంది. సోమవారం పులిచర్ల, కోమటికుంటతండా, పర్వేదుల, గేమ్యానాయక్‌తండాకు చెందిన ప్రజాప్రతినిధులు, ప్రజలు దీక్షలో పాల్గొన్నారు. కార్యక్రమంలో పులిచర్ల మండల సాధన సమితి చైర్మన్ దేవసాని శ్రీనివాస్‌రెడ్డి, దేవసాని పుల్లారెడ్డి, వెంకట్‌రెడ్డి, ఎల్లయ్యగౌడ్, మార్కెట్ డైరెక్టర్ కిషన్‌నాయక్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లిలో అఖండ భారత్ దివస్

చింతపల్లి: మండల కేంద్రంలో సోమవారం అఖండ భారత్ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భజరంగ్‌దళ్ నాయకులు యాదిరెడ్డి, వెంకట్, వంశీ, విశ్వహిందూ పరిషత్ నాయకులు జగదీశ్, ప్రదీప్‌కుమార్, శివర్ల రమేశ్ పాల్గొన్నారు.

భద్రాచలంలో త్రిపురారం భజన బృందం

త్రిపురారం: భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం నందు త్రిపురారం గ్రామంలోని శ్రీకోదండరామచంద్రస్వామి భజన మండలి బృందం సోమవారం ప్రదర్శన ఇచ్చినట్లు శ్రీరామదాసు భజన మండలి రాష్ట్ర శాఖ అధ్యక్షుడు సిద్దేశ్వర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ భజన బృందాన్ని ఆలయ ఈఓ, ప్రధాన పూజారి ప్రశంసించినట్లు తెలిపారు. కార్యక్రమంలో రాపర్తి ధనుంజయ, భద్రమ్మ, ఆదమ్మ, ధనలక్ష్మి, పద్మ, నారమ్మ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

దేవరకొండ: బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో దేవరకొండ నియోజకవర్గ వ్యాప్తంగా ఈ నెల 26 నుంచి నిర్వహించనున్న 'పల్లెపల్లెకు బీఎస్పీ..ప్రగతి భవన్‌కు ఆర్‌ఎస్పీ' యాత్రను విజయవంతం చేయాలని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎర్ర కృష్ణ, నియోజకవర్గ అధ్యక్షుడు రమావత్ రమేష్‌నాయక్ పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని రహదారి బంగ్లా వద్ద యాత్రకు సంబంధించి వాల్ పోస్టర్లను వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సలహాదారులు ఏకుల రాజారావు, ప్రకాష్ తదితరులున్నారు.

'చలో మర్రిగూడ' కరపత్రం ఆవిష్కరణ

కొండమల్లేపల్లి: మాదిగల విశ్వరూప మహాసభలో భాగంగా ఈ నెల 17న మర్రిగూడలో నిర్వహించనున్న జిల్లాస్థాయి సన్నాహక సదస్సును విజయవంతం చేయాలని మహాసభ పరిశీలకుడు ఆడెపు నాగార్జున పిలుపునిచ్చారు. సోమవారం సన్నాహక సదస్సుకు సంబంధించిన కరపత్రాన్ని స్థానికంగా ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఎంఎస్‌ఎఫ్ దేవరకొండ నియోజకవర్గ ఇన్‌చార్జిలు పోతెం సహదేవుడు, మారుపాక గోపాల్‌మాదిగ, అంకూరి నాగరాజుమాదిగ, పంది శ్రీను, చిన్నఅడిశర్లపల్లి సర్పంచ్ గడ్డం శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులపై దాడి చేసిన వారిని శిక్షించాలి

వేములపల్లి: జర్నలిస్టులపై దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఆర్టీఐ పర్యవేక్షణ రాష్ట్ర అధ్యక్షుడు నారబత్తుల అనంతచారి అన్నారు. సోమవారం ఆయన వేములపల్లి మండల కేంద్రంలో మాట్లాడుతూ.. వేములపల్లి గ్రామ శివారులోని సర్వే నంబర్ 652లో తహసీల్దార్ తమకు కేటాయించిన స్థలాన్ని జర్నలిస్టులు చదును చేసుకుంటుండగా కొందరు వచ్చి జర్నలిస్టులను దూషిస్తూ వారిపై దాడులకు పాల్పడడం దారుణమన్నారు.

నేడు వీరారెడ్డి వర్ధంతి సభ

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడ పట్టణంలో మంగళవారం కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణ కర్త రాగిరెడ్డి వీరారెడ్డి వర్ధంతి సభను నిర్వహించనున్నట్లు సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్ తెలిపారు. సోమవారం మిర్యాలగూడలోని సీపీఎం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఉదయం 9గంటలకు పార్టీ కార్యాలయం ఉంచి బైక్ ర్యాలీ ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ బైక్ ర్యాలీలో కార్యకర్తలు భారీగా పాల్గొని వీరారెడ్డి స్థూపం వద్ద జరిగే వర్ధంతి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు ముడావత్ రవినాయక్, మల్లు గౌతంరెడ్డి, రాగిరెడ్డి మంగారెడ్డి, పతాని శ్రీను, సైదానాయక్, వెంకట్‌రెడ్డి, ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.